క్లుప్తంగా

పల్లె ప్రకృతివనం అగ్నికి దగ్ధం



అయిజ: మండలంలోని సంకాపురం పల్లెప్రకృతి వనం మంగళవారం అగ్నికి దగ్ధం అయ్యింది. దీనివల్ల పెంచిన మొక్కలు కాలిపోయి ఆ ప్రదేశం ఎడారిని తలపిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేష్ పంచాయతీ సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పేశారు. ఎవరైనా బీడీ తాగి పడేశారా లేక ఉద్దేశ పూర్వకంగా నిప్పంటించారా? అనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. మంటలు చెలరేగడానికి కారణం తెలుసుకునేందుకు ఎంపీడీఓ వెంకటయ్య విచారణ చేపట్టారు.

మొక్కలు ఎండె.. కంచెలు మిగిలె!



మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న పథకాలలో హరితహారం కార్యక్రమం ఒకటి. మండలంలోని మద్దూరు స్టేజీ అంతర్రాష్ట్ర రహదారి రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల చుట్టు ఉన్న కంచెలు మాత్రమే మిగిలి మొక్కలు ఎండిపోయాయి. ఇది ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా బాలచంద్రుడు



గద్వాల క్రైం: గద్వాల ట్రాఫిక్ ఎస్ఐగా ఆర్ఎస్ఐ బాల చంద్రుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. మైనర్లకు బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడిపిన కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జరిమానాలు చెల్లించని వాహనదారులు గడువులోపు మీసేవ, ఇతర ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఐ విజయభాస్కర్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు.

వెలగని విద్యుత్ బల్బులు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులోని ఎస్సీ కాలనీలోని సోమవారం రాత్రి విధి దీపాలు వెలగడం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని చాలా రోజులుగా గ్రామంలో విద్యుత్ బల్బులు వెలగడం లేదని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వీడి విద్యుత్ బల్బులు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో స్వల్పగాయాలు

అయిజ: మున్సిపాలిటీ సమీపంలోని తుపత్రాల శివారులో మంగళవారం రాత్రి కర్ణాటకకు చెందిన కారు మంత్రాలయం వెళ్తూ టైరు పగిలిపోవడంతో పక్కనే ఉన్న చిన్న గుంతలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురువ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారును అక్కడే వదిలేసి వేరే వాహనంలో మంత్రాలయం వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

ప్రజాదీవెన సభను విజయవంతం చేయండి

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పాలమూరు ప్రజా దీవెన బహిరంగసభను విజయవంతం చేయాలని ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఆయా మండల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

కొండచిలువ పట్టివేత

పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లిలో రైతు కృపాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో గొర్రెల కాపరి మధు గొర్రెలను మేపుతూ పక్కనే ఉన్న షెడ్ వద్ద సేదతీరుతున్నాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో గదిని తెరిచి చూడగా అందులో ఉన్న ఫ్రిజ్ కింద పడుకొని ఉన్న కొండశిలువ గుర్తించాడు. వెంటనే అతడు వనపర్తి హోంగార్డు కృష్ణసాగర్‌కు ఫోను ద్వారా సమాచారం ఇచ్చాడు. స్పందించిన ఆయన వెంటనే తోమాలపల్లికి చేరుకొని అక్కడ ఉన్న కొండచిలువను బంధించి తీసుకెళ్లాడు.

ప్రయాణ ప్రాంగణంలో వసతులేవి?

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- దాతల కోసం ఎదురుచూపు

అయిజ: జిల్లాలో పెద్ద మండలమైన అయిజలో ఆర్టీసీ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాంగణంలో కనీసం తాగునీటి వసతి లేని దుస్థితి నెలకొంది. బస్‌షెల్టర్ బిల్డింగ్ కింద కనీసం కూర్చోవడానికి సరిపడా కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. వర్షాకాలంలో ఈదురు గాలులకు ప్రయాణికులపై ఒలిపిరి పడుతోంది. వేసవికాలంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంటోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కొన్నేళ్ల క్రితం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండడంతో మూ డు రాష్ట్రాల ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ నిరంతరం రద్దీగా ఉంటుంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. బస్సులు వచ్చేంత వరకు ఎండలో ఉండాలి. లేదంటే వర్షంలో తడవాలి. కనీసం తాగునీటి వసతి కూడా కల్పించకపోవడంతో ప్రయాణికులు వ్యాపార దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మౌలిక వసతులు లేని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం



సీసీ బెడ్డు ఏర్పాటు చేయని ఆర్టీసీ మైదానం

గుంతలు పడిన మైదానం..

ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సీసీ బెడ్ వేయకపోవడంతో భూమి గుంతలు పడింది. బస్సులు వచ్చి వెళ్లేటప్పుడు దుమ్మురేగి ప్రయాణికులపై పడుతోంది. వర్షాకాలంలో గుంతల్లో మురుగునీరి నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వాహనాలు వెళ్లేటప్పుడు బురదనీరు ప్రయాణికులపై పడడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆర్టీసీకి అధిక ఆదాయం..

ఆర్టీసీ సంస్థకు అధిక ఆదాయం సమకూరుతున్నా ఆర్టీసీ ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యలు తెలియజేశాం



అయిజ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో అనేక సమస్యలున్నాయని తెలుపుతు న్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పించేందుకు నిధులు మంజూరు కాలేదు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తా బాగుంటుంది. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని బ్యాంకర్సన్ కోరుతున్నాం.

– మంజుల రెడ్డి, ఆర్టీసీ డీపో మేనేజర్

ఇబ్బందిగా ఉంది



ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. బస్ షెల్టర్ చిన్నగా ఉండడంతో కూర్చు నేందుకు ప్రయాణికులకు స్థలం చాలడంలేదు. కనీ సం ప్రయాణికులకు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు నిలబడాల్సి వస్తోంది. మెట్లపై కూర్చోని బస్సులకోసం ఎదు రు చూస్తుంటారు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి

– మహబూబ్ బాషా, అయిజ

దాతలు ముందుకు రావాలి



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ సంస్థ కనీసం తాగునీటిని ఏర్పాటు చేయడంలేదు. వేసవి కాలంలో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పేద ప్రజల దాహం తీర్చారు. ఈయేడాది ఇంతవరకు దాతలు కూడా తాగునీటి వసతి కల్పించలేదు. దాతలు ముందుకు వచ్చి చలి వేంద్రం ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు కొంత ఊరట కలుగుతుంది.

– హరికృష్ణ, కేశవరం

పట్టించుకోవడం లేదు



వేసవి కాలంలో ప్రయాణికులు దాహంతో అల్లాడిపోతున్నారు. వ్యాపార దుకాణాల్లో తాగునీటిని కొని తాగాల్సి వస్తుంది. లీటర్ వాటర్ బాటిల్ కొనే స్తోమతలేని పేదవారు దాహంతో అల్లాడిపోతుంటారు. కనీసం కనీస వసతుల్లో ఒకటైన తాగునీటిని సైకర్యం లేకపోయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు.

– మస్తాన్, అయిజ

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన స్క్వాడ్



గట్టులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం 63మంది విద్యార్థులకు 61 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణలు తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

గట్టు: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 323 మంది విద్యార్థులకు గాను, 322 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మల్దకల్: మండల కేంద్రంలో ఆలయ ప్రధాన రహదారిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్, బషీర్, తిమ్మప్ప, గోవిందు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లిలో మంగళవారం రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో యువరాజు, సోమనాద్రి, ఎల్కూర్ శ్రీను, జయచంద్రారెడ్డి, మద్దిలేటి, బీచుపల్లి, రాజు, రామ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణ ఉన్నారు.

బస్సులేక ట్రాక్టర్‌లో పాఠశాలకు..



ట్రాక్టర్‌పై బడికి వెళ్తున్న విద్యార్థులు

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం బస్సు రాకపోవడంతో ట్రాక్టర్‌లో పాఠశాలకు వెళ్లాల్సివచ్చింది. ఏళ్ల తరబడి అదే గ్రామం నుంచి మాన్‌దొడ్డిలోని జిల్లా పరిషత్ పాఠశాలకు విద్యార్థులు పదుల సంఖ్యలో వెళ్తున్నారు. మాన్‌దొడ్డికి వెళ్లే బస్సులోనే విద్యార్థులు బడికి వెళ్తుండగా, కొన్ని రోజులుగా బస్సు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు సరైన సమయంలో పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. ఉదయం 9 గంటలకు వెళ్లాల్సి ఉండగా, 11.30 గంటలైనా బస్సు రాకపోవడంతో మధ్యాహ్నం సమయంలో పాఠశాలకు హాజరు కావల్సి వస్తోంది. దీంతో తరగతిలో పాఠాలు మిస్సవుతున్నారు. కొద్ది రోజులుగా వేధిస్తున్న ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఆలస్యంగా వెళ్లడం వల్ల పదో తరగతి విద్యార్థులకు మరింత ఇబ్బంది ఏర్పడింది. బస్సు సమయానికి రాకపోవడంతో ఆటోలు, మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లపై వెళ్లాల్సివస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పంటరుణాలకు వడ్డీ చెల్లించండి



వడ్డీ చెల్లించిన రైతుకు రశీదు అందిస్తున్న సీఈఓ

మానవపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంటరుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి సహకరించాలని సీఈఓ మద్దిలేటి తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో, పలు గ్రామాల్లో పంటరుణాలు వడ్డీలను వసూలు చేశారు. సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న 14 గ్రామాల రైతులు మార్చి 15వ తేదీ లోపల సహకార సంఘంలో 7 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని 14 గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్‌అసిస్టెంట్ ప్రభాకర్‌నాయుడు, సాయికుమార్, రైతు పోసిరెడ్డి పాల్గొన్నారు.

టెట్ నోటిఫికేషన్ వేయాలని ఎమ్మెల్సీకి వినతి



ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం వెంటనే టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ మంగళవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో ఎంతో మంది నిరుద్యోగులు నష్టపోతున్నారని, ఇప్పటి వరకు టెట్ అర్హత సాధించని వారు, ఇటీవల బీఈడీ, టీటీసీ పూర్తి చేసి టెట్ రాయని వారు ఎంతో మంది ఉన్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వారికి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ధరూరులో ఉపాధ్యాయులైన విద్యార్థులు

ధరూరు: విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రంలోని కుర్వ వీధి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కల్యాణి, మాధవి పాల్గొన్నారు.



బస్వాపురంలో..

గట్టు: మండలంలోని బస్వాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ చంద్రకాంత్ వదన్, ఉపాధ్యాయులు అక్కల భీసన్న తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం డ్రైవర్‌పై దాడి

ధరూరు: గోవా నుంచి విజయవాడకు పాత టైర్ల లోడుతో వెళ్తున్న డీసీఎం డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. మంగళవారం సాయంత్రం 5గంటల సమయంలో గోవా నుంచి రాయచూర్ మీదుగా గద్వాల వైపు వెళ్తున్న డీసీఎం, ధరూరు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో గద్వాల నుంచి వచ్చిన నోబుల్ స్కూల్ బస్సు ఎదురుపడ్డాయి. దీంతో స్కూల్ డ్రైవర్ డీసీఎం డ్రైవర్‌పై దాడి చేశాడు. తన మార్గంలో తాను వెళ్తున్నా ఎందుకు దాడి చేస్తున్నారంటూ డీసీఎం డ్రైవర్ ప్రశ్నించారు. ఇరువురికి గ్రామస్తులు నచ్చజెప్పి పంపించారు. డీసీఎం డ్రైవర్‌పై దాడి జరుగుతున్న దృశ్యాన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

ఆత్మకూర్ కవయిత్రికి సాహిత్య పురస్కారం



ఆత్మకూర్: వేయి వెలుగుల తెలుగు వెలుగు అంతర్జాతీయ అంతర్జాల కవితా పోటీల్లో ఆత్మకూర్‌కు చెందిన కవయిత్రి బండారు సునీతకు తెలుగు వెలుగు సాహిత్య పురస్కారం లభించింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న బండారు సునీత హైదరాబాద్‌లో జరిగిన తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవిత పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కవితా పోటీల్లో జాతీయస్థాయిలో సాహిత్య సేవా పురస్కారం ఆత్మకూర్ వాసికి రావడం అభినందనీయమని జీహెచ్ఎం కొండాపురం బాలరాజు అన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఆయాపార్టీలకు చెందిన నాయకులు బండారు సునీతను అభినందించారు.

బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అయిజ: మండల కేంద్రంలో తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు వేషధారణలతో అలరించారు. మంగళవారం ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తిక్క వీరేశ్వర స్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. జాతరలో కాడెద్దుల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు వ్యవసాయ పరికరాలను విక్రయిస్తున్నారు. గృహ అవసరాలకు సంబంధించిన వస్తువులను మహిళలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఇంటికి బంధువులు రావడంతో పట్టణం మొత్తం సందడిగా మారింది.

కోనేరు ఎల్లమ్మకు భక్తుల పూజలు

అలంపూర్ రూరల్: మండలంలోని కోనేరులో వెలసిన ఎల్లమ్మ భక్తుల కోర్కెలు తీర్చు ఇలవేల్పుల విరాజిల్లుతోంది. మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో ఎల్లమ్మ దర్శనానికి తరలిరావడంతో గుడి దగ్గర భక్తుల సందడి నెలకొంది. భక్తులు తెచ్చిన నివేదనలు అమ్మవారికి అందజేసి మొక్కులను తీర్చుకున్నారు.

గాలికుంటు వ్యాధి సోకితే రైతులకు నష్టం



ఎద్దుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పాడి పశువులకు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకితే యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా టీకాలు వేయించాలన్నారు. గ్రామంలోని 19 మంది రైతులకు చెందిన 146 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఓఎస్ రవికిరణ్, కార్తీక్, గోపాలమిత్ర లక్ష్మన్న పాల్గొన్నారు.

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు పశువులకు వేస్తున్న టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. బింగిదొడ్డి, తుపత్రాలలో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి మాట్లాడారు. థైలెరియా వ్యాక్సిన్ థైలెరియోసిస్ అను టిక్‌బోర్న్ వ్యాధులను నివారిస్తుందన్నారు.

అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అయిజ: భారతమాల రోడ్డు నిర్మాణంలో భా గంగా అయిజ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంట పొలాలకు ఏర్పాటు చేసిన రోడ్లు మునిగిపోయాయని, వాటి స్థానంలో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భారతమాల రోడ్డు విస్తరణ వల్ల ఆటంకాలు ఏర్పడినట్లు తెలిపారు. పంట పొలాలకు వెళ్లే రోడ్లతో పాటు తూంకుంట నుంచి పర్దీపురం, జడదొడ్డి, వెంకటాపురం గ్రామాలకు ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్లు భారతమాల రోడ్డు నిర్మాణంతో మూతపడ్డాయన్నారు. దానివల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేల కోతపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న భరత్‌సింహ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బుడ్డారెడ్డిపల్లిలో మంగళవారం రైతులకు నేల కోతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహ మాట్లాడుతూ నేల కోతకు గురికావడం వల్ల భూమి క్షీణించడంతో పాటుగా నదులలో నీటి కాలుష్యం అధికం అవుతుందన్నారు. దీనివల్ల జల జీవుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు వరదలు ఎక్కువగా సంభవిస్తాయన్నారు. నేల కోతను పరిమితం చేయడానికి బంజరు భూముల్లో మొక్కలు నాటాలన్నారు. నేల కోతను నివారించడానికి మొక్కలు, గడ్డిని ఉ ప యోగించి వాటికి రక్షణ కవచంగా రాళ్లను జోడించాలన్నారు. వాలుతో కోతను తగ్గించడానికి మల్చ్ మాటింగ్‌ను ఉపయోగించవచ్చని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం శాసనమండలి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, చల్లా అభిమానులు ఎర్రవల్లి కూడలిలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విరాళం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాతర్లలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి ఆలయం నిర్మాణానికి కొండేరుకు చెందిన పోతురాజు శంకరమ్మ సేవాదళం చైర్మన్ పోతురాజు సోమనాద్రి మంగళవారం సాతర్ల గ్రామస్తులకు రూ.50 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు గట్టుబాబు, తిమ్మప్ప, సిరాజ్, నారాయణ, బుచ్చన్న ఉన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

ధరూరు: పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశైలంలో అన్నదానం నిర్వహించినట్లు అర్చకులు ఆద్య కేశవాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 12 ఏళ్లుగా భక్తులకు మహాశివరాత్రి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధరూరు నుంచి భక్తులు హాజరైనట్లు తెలిపారు.



శ్రీశైలంలో అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పుస్తకాల పంపిణీ

వీపనగండ్ల: 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమంగా రాణించాలన్న ఉద్దేశ్యంతో 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన క్వశ్చన్ బ్యాంక్ గైడ్స్ నిలిచిపోయాయి. మండలంలో 174 మంది 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంది. పుస్తకాలను ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా నిలిపివేయడం అన్యాయం అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.